ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 21 జనవరి 2024





సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి సీతక్క

సర్కారు లక్ష్యాలు నెరవేర్చండి..

హనుమకొండ సిటీ, జనవరి 20: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం ఆయన వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చారు. హను మకొండలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాల అభివృద్ధి అంశంపై అంతర్గతంగా సమీక్ష జరిపారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచం ద్రునాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్వినీరెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉదయం 11:30గం టలకు ఆరంభమైన సమీక్ష.. సాయంత్రం 5:15గంటల వరకు కొనసాగింది. ప్రతీ జిల్లాలోని నియోజకవర్గాల వారిగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష జరిపారు. అధికా రుల నుంచి నివేదికలు కోరారు. ఎమ్మెల్యేల ప్రతిపా దనలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల అభివృద్ధి, ప్రజల సమస్యలు, పరిష్కా ర చర్యలు, నిధుల వ్యయం, కేటాయింపు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలు సేకరించి వాటిని ఆచరణలో పెట్టే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఇరిగేషన్, పంచాయతీరాజ్ పనులే కీలకంగా..

వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, పంచాయతీరాజ్ పనులే కీలకంగా సమీక్ష జరిగింది. జిల్లాలోని వ్యవసాయ సాగు, తాగునీటి వనరులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల వివరాలు, పూర్తయినవి, అమల్లో ఉన్నవి, ఇంకా ప్రారంభించని ప్రాజెక్టుల విషయాలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చర్చించారు. అదే విధంగా పంచాయతీరాజ్ శాఖ పనులును సమీక్షించారు. బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గాల వారిగా ప్రకటిం చిన ప్రాజెక్టులను అధికారుల నుంచి అడిగి తెలుసుకు న్నారు. ప్రకటించిన ప్రాజెక్టులు ఆచరణలోకి వచ్చా యా.. లేదా.. అసలే చేపట్టనివి ఎన్ని? ప్రారంభించి వదిలేసినవి ఎన్ని? అనే వివరాలను అధికారుల నుంచి సమగ్రంగా సేకరించి సమీక్ష జరిపారు. ప్రతీ నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు, నిధుల కేటా యింపు, నిర్దేశిత లక్ష్యాలు, అభివృద్ధి పనుల ముగింపు అంశాలపై అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. ప్రజా పాలన అభయహస్తం గ్యారంటీల దరఖాస్తు లు, కంప్యూటరీకరణను చర్చించారు. రెండు పడక గదుల నిర్మాణం, పంపిణీ వివరాలను సమీక్షిం చారు. 12 నియోజకవర్గాల పెండింగ్ సమస్యల పరిష్కార చర్య లు చేపట్టాలని, అభయహస్తం హామీలను నెరవేర్చాల ని సూచించారు. అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని, ప్రజల సమస్యలు, అభివృద్ధి ఫలాలే పని తనానికి కొలమానమని స్పష్టం చేశారు.

- ప్రజలు, ప్రభుత్వానికి వారధులు మీరే..
- నిర్లక్ష్యాన్ని ప్రదర్శించే అధికారులను ఉపేక్షించం
- అమల్లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయండి
- ఇరిగేషన్, పంచాయతీరాజ్ పనులు కీలకం
- ప్రాజెక్టులు, నిధులు, పూర్తిపై మరింత సమాచారమివ్వాలి..
- ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి సమీక్షలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లాల వారీగా సుదీర్ఘంగా చర్చించిన పొంగులేటి

జాతరను విజయవంతం చేద్దాం..

మేడారం జాతరను సమష్టిగా విజయవంతం చేద్దామని మంత్రి సీతక్క కోరారు. జాతర కోసం ప్రభుత్వం రూ.105కోట్లు కేటాయించిందని

మిగతా 7వ పేజీలో..

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

అభివృద్ధి సమావేశం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా మారింది. బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల మధ్య జరిగిన సంభాషణ సమావేశాన్ని వేడెక్కించింది. కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి సమావేశంలో పాల్గొనడం, కమలాపూర్‌లో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ, ప్రొటోకాల్ అంశాలు రగడకు కారణమయ్యాయి. జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తనకు ప్రొటోకాల్‌ను ఇవ్వడం లేదని, తన నియోజకవర్గంలో కూడా అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇవ్వాలని, ఎమ్మెల్యే కాని వారిని సమావేశంలో ఎలా ఉంటారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో తనకు తెలియకుండా కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ జరిగిందంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చెప్పడంతో మంత్రి పొన్నం ప్రభాకర్

మిగతా 7వ పేజీలో..

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధిక నిధులు

- మేడారం జాతరకు రూ.105కోట్లు
- ప్రజాభిప్రాయానికి అనుగుణంగా మాస్టర్‌ప్లాన్
- ప్రగతి భవన్ నిర్మాణానికి 8 నెలలు.. కాళోజీ కళాక్షేత్రానికి పదేళ్లా..?
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కోరారు. హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాల అభివృద్ధిపై శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్ హాజరై అధికారులతో చర్చించారు. ఇందులో మురళీనాయక్ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన జాతీయ రహదారి 930పీ నిర్మాణంతో రైతులు, గిరిజనులు, నిరుపేదలు భూములు కోల్పోతున్నారని సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి పొంగులేటి జోక్యం చేసుకుని జాతీయ రహదారులు, రైల్వే నిర్మాణ పనుల్లో ఆటంకం జరిగితే పనులు నిలిచిపోయే ప్రమాదముందని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

రైతులందరికి నష్ట పరిహారం చెల్లించాలి

డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణ కింద రైతులకు చెల్లించే నష్టపరిహారం ఒకే విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ కోరారు. జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గంలో సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కింద రైతులందరికి నష్టపరిహారం ఒకేలా చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల దెబ్బతిన్న చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు అన్నిమండలాలకు అందేలా చూడాలన్నారు. తొర్రూరులో ఉన్నఆర్డీవో కార్యాలయాన్ని మరిపెడకు మార్చాలని, మరిపెడలో మున్సిఫ్‌కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మరిపెడ, తొర్రూరులలో వందపడకల ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని కోరారు. బయ్యారంలో ఉక్కుపరిశ్రమ నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

- జిల్లాలో 844 మంది విద్యార్థుల హాజరు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 20 : జిల్లాలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు శనివారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా అర్హత పరీక్షకు 1,164 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించిన ఎగ్జామ్‌కు 844 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సెంటర్‌లో 264 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానుండగా, 201 మంది హాజరయ్యారు. మోడల్ స్కూల్ సెంటర్‌లో 176 మంది పరీక్ష రాశారు. మరిపెడలోని సెయింగ్ ఆగస్టిన్ పాఠశాలలో 168 మంది హాజరు కానుండగా, 105 మంది హాజరయ్యారు. మరిపెడ మోడల్ స్కూల్ సెంటర్‌లో 190 మంది పరీక్షకు హాజరు కానుండగా, 114 మంది విద్యార్థులు ఎగ్జామ్ రాశారు. గూడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల సెంటర్‌లో 292 మంది హాజరుకానుండగా, 248 మంది హాజరయ్యారు. కాగా, జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 11,62 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా 844 మంది హాజరయ్యారు. 318 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. గూడూరులోని జడ్పీహెచ్ బాలుర పాఠశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించినట్లు డీఈవో రామారావు వివరించారు.

బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 : జిల్లా కేంద్రంలో ఈనెల 24, 25న జరుప తలపెట్టిన బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మునిసిపల్ చైర్మన్, బొడ్రాయి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మానుకోటలో శనివారం బొడ్రాయి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కమిటీ సమావేశాన్ని నిర్వహించి,వార్షికోత్సవ విజయవంతంపై చర్చించారు. అనంతరం బొడ్రాయి విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో ఫిబ్రవరి మాసంలో బొడ్రాయి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి, ఏడాది పూర్తవుతున్న సందర్భంగావార్షికోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ వేడుకలో ప్రజలంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మార్నేని వెంకన్న, మాలె నాగేశ్వర్ రావు, ఆకుల హరిప్రసాద్ సూర్నపు సోమయ్యబోనగిరి గంగాధర్, కర్పూరపు గోపి, ఉపేందర్, రాములు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి



కొంపల్లి రక్షిత్ (ఫైల్)

కొత్తగూడ, జనవరి 20 : నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన కొత్తగూడ మండలం వేలుబెల్లిలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేలుబెల్లి గ్రామానికి చెందిన కొంపల్లి యాకయ్య-అని దంపతులకు కుమారుడు రక్షిత్ (4) ఉన్నాడు. శనివారం తల్లిదండ్రులు ఇంటి పనుల్లో నిమగ్నమైఉండగా రక్షిత్ ఆడుకొంటూ వెళ్ల నీటిసంపులో పడి మృతి చెందాడు. బాలుడి కోసం తల్లిదండ్రులు వెతకగా, నీటిసంపులో మృతదేహం కనిపించింది. దీంతో రక్షిత్ మృతదేహంను చూసి తల్లిదండ్రులు విలపించారు.

నేడు కొత్తబజారులో విద్యుత్‌కు అంతరాయం

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 : మహబూబాబాద్ పత్తిపాక విద్యుత్‌సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌లైన్‌లో వైర్లకు తగులుతున్న చెట్లను తొలగించనున్న క్రమంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12 వరకు కొత్తబజారులోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్-2 ఏఈ నవ్యశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని ముత్యాలమ్మగుడి సెంటర్ నుంచి మూడుకొట్ల సెంటర్ వరకు, మెడికల్ కాలేజీ, ఎస్పీ ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు

- మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 20 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి భక్తులు శనివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర జరగనున్న నేపథ్యంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను ముందస్తుగా దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి సైతం కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ముందుగా జంపన్నవాగులో స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరెసారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం)తో మొక్కులు చెల్లించుకున్నారు. చల్లగా చూడాలని తల్లులతను వేడుకున్నారు. సుమారు 20వేల మందికిపైగా భక్తులు దర్శించుకు న్నారని ఈవో రాజేంద్రం తెలిపారు.



జోరుగా.. హుషారుగా..

- ఆకట్టుకున్న ఈవెంట్లు
- ఆలోచింపచేస్తున్న ఎగ్జిబిట్లు
- వివిధ అంశాలపై వర్క్‌షాపులు
- ప్రముఖుల ప్రసంగాలు
- సందడిగా రెండోరోజు టెక్నోజియాన్
- ఆవిష్కృతమైన మినీ భారతం

వివరాలు 7లో..

వరంగల్ నిట్ కళాశాలలో రెండోరోజు శనివారం టెక్నోజియాన్ (సాంకేతిక ఉత్సవం)-2024 జోరుగా హుషారుగా సాగింది. శుక్రవారం నిర్వహించిన ఈవెంట్లు రెండోరోజు కూడా కొనసాగాయి. వివిధ అంశాలకు సంబంధించి రూపొందించిన సుమారు మరో 40 కొత్త ఈవెంట్లు శనివారం జరిగాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నిట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు రూపకల్పన చేసిన ఈ ఈవెంట్లు సరికొత్త సాంకేతికతలను ఆవిష్కరించాయి. ఒక్కో ఈవెంట్ ఒక్కో ప్రత్యేకతను చాటాయి. సాంకేతిక ప్రపంచంలో ఎప్పటికప్పుడు చోటు చేసుకుంటున్న నూతన పోకడలను దృష్టిలో ఉంచుకొని వాటికి అనుగుణంగా వీటిని రూపొందించారు. దైనందిన జీవితంలో ప్రజల అవసరాలు, భవిష్యత్తులో ఎదురయ్యే నూతన సవాళ్లను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ ఈవెంట్లలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ప్రతిభాపాటవాలను చాటుకున్నారు.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ కాజీపేట

అడవులను రక్షించడమే ధ్యేయం

కంపా అడిషనల్ పీసీసీఎఫ్ సువర్ణ




పులిమడుగులో ఏర్పాటు చేసిన క్యాంపెయిన్ క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న సువర్ణ

గూడూరు, జనవరి 20 : అడవులు ఆక్రమణకు గురికాకుండా సంరక్షించడమే ప్రభుత్వ ధ్యేయమని అటవీశాఖ కంపా అడిషనల్ పీసీసీఎఫ్ సువర్ణ అన్నారు. గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని కార్లాయి సెక్షన్ శివారు అటవీప్రాంతం పులిమడుగులో నిర్మించిన క్యాంపెయినింగ్ క్వార్టర్స్‌ను శనివారం ప్రారంభిం చారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న ప్లాంటేషన్‌లను పరిశీలించారు. ఆక్రమణలు, కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేట, హరితహారం మొక్కల పెంపకంపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా ఎవరైనా పోడు సాగు పేరుతో అడవులను నరికివేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడవులు కలప స్మగ్లర్ల బారిన పడకుండా పగలు, రాత్రి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వన్య ప్రాణుల వేటపై నిఘా పెంచడంతో ఇప్పుడు చాలా వరకు వేట తగ్గిందని, అడవుల్లో నీటి కుంటలు, చెక్‌డ్యాంలు, సాసర్ పీట్లు నిర్మించి వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. అడవుల్లో నీటి వనరులు ఉండడం ద్వారా వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు వచ్చే అవకాశం లేదని తెలిపారు. ఏటా హరితహారం ద్వారా ప్లాంటేషన్‌లను ఏర్పాటు చేసి, వాటిని సంరక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం సీసీఎఫ్ భీమానాయక్, మహబూబాబాద్ డీఎఫ్‌వో రవికిరణ్, ఎఫ్‌డీవోలు చంద్రశేఖర్, కృష్ణమాచారి, రేంజ్ అధికారులు సురేష్, చలపతి, డీఆర్వోలు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో సాంకేతికతే కీలకం

- సవాళ్లను అధిగమిస్తేనే విజయం
- టెక్నోజియాన్‌లో రెడ్ బస్ సీఈవో ప్రకాశ్ సంగం

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో సాంకేతికతే కీలకమని, ప్రస్తుత ప్రపంచంలో సాంకేతిక సాయం లేకుండా ముందుకు వెళ్లలేమని రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం అన్నారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన అతిథి ప్రసంగం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రకాశ్ సంగం

ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. ముఖ్యంగా వ్యాపార రంగంలో సాంకేతికత కీలకభూమిక పోషిస్తుందన్నారు. సాంకేతికత జీవితాలను ఎలా మారుస్తుందో ఇంజనీర్లు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రతీ రంగంలో సవాళ్లు, సమస్యలు ఉంటాయని, వాటిని అర్థం చేసుకొని పరిష్కరించుకుంటూ వెళ్లడంతోనే విజయం సాధ్యం అవుతుందన్నారు. రెడ్ బస్ మార్కెట్‌లో పోటీని ఎలా ఎదుర్కొన్నది, వాటిని ఎలా అధిగమించింది సోదాహరణగా ఆయన వివరించారు. పట్టుదల, కృషి, నిబద్ధత, నిజాయితీలే ప్రతీ మనిషి విజయ శిఖరాలను అందుకోవడానికి నిచ్చెనమెట్లలాగా ఉపయోగపడతాయన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు తరగతి గదిలో తాము నేర్చుకున్నదే కాకుండా క్షేత్రస్థాయిలో దానిని ఆచరణాత్మకం చేయాలని అన్నారు. అప్పుడే మనం నేర్చుకున్న జ్ఞానానికి సార్థకత లభిస్తుందన్నారు. రెడ్ బస్ సీఈవోగా తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

సాంకేతిక విజ్ఞానదాయిని

టెక్నోజియాన్

▸ విద్యార్థుల మనోభావాలు

ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్ కళాశాలలో నిర్వహిస్తున్న టెక్నోజియాన్ విజ్ఞానదాయకంగానూ, స్ఫూర్తిమంతంగానూ ఉందని ఇందులో పాల్గొంటున్న పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. టెక్నోజియాన్‌లో పాల్గొనడం తమ అదృష్టంగా పేర్కొన్నారు. ఎన్నో కొత్త విషయాలను నేర్చుకుంటున్నామని చెప్పారు. తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించాలనుకునే ఇంజనీరింగ్ విద్యార్థులు ఇలాంటి టెక్నోఫెస్ట్‌లో తప్పకుండా పాల్గొనాలని అన్నారు. వారి మాటల్లోనే...

పాల్గొనడం ఇది మూడోసారి



మధురెడ్డి, బీటెక్ ఫైనల్ ఇయర్ (ట్రిపుల్ ఈ), గుంటూరు

వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్‌లో వరుసగా పాల్గొనడం ఇది మూడోసారి. హాజరైన ప్రతీసారి సాంకేతికంగా కొత్త విషయాలను నేర్చుకుంటున్నాను. సరికొత్తగా చోటుచేసుకుంటున్న సాంకేతిక ఆవిష్కరణలను అర్థం చేసుకోవడానికి, సాంకేతికంగా మన ఆలోచనలకు పదును పెట్టడానికి టెక్నోజియాన్ మంచి వేదిక.

కొత్త ఆలోచనలకు అంకురం టెక్నోజియాన్



దేవిశ్రీ, బీటెక్ ట్రిపుల్ ఈ, వైజాగ్

విద్యార్థులో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు, వినూత్న సాంకేతిక ఆవిష్కరణలకు సమష్టిగా కృషి చేయడానికి టెక్నోజియాన్ ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. విద్యార్థుల్లో వైజ్ఞానిక జిజ్ఞాసను పెంపొందించేందుకు టెక్నోజియాన్‌ను మించిన వేదిక మరొకటి లేదు. ఈ ఈవెంట్ టీమ్ లీడర్‌గా తాను ఈ టెక్‌ఫెస్ట్‌లో పాల్గొంటున్నాను

కొత్త జ్ఞానానికి ద్వారం టెక్నోజియాన్



హర్ష, మెకానికల్ సెకండ్ ఇయర్, హైదరాబాద్

జ్ఞానాన్ని విస్తరింప చేసుకునేందుకు, నలుగురితో కలిసి పనిచేసేందుకు, మనలోని భావాలను ఇతరులతో పంచుకునేందుకు టెక్నోజియాన్ ఎంతో ఉపయోగపడుతుంది. మొదట్లో నాకు స్టేజి ఫియర్ ఉండేది. టెక్నోజియాన్‌లో పాల్గొన్న తర్వాత అది పోయింది. నాలో నాయకత్వ లక్షణాలు బలపడ్డాయి. టెక్నోజియాన్ నిర్వహణ బాగుంది. ఏర్పాట్లు బాగా చేశారు.

- సుబేదారి

జోరుగా.. హుషారుగా...

▸ సందడిగా రెండో రోజు టెక్నోజియాన్

హనుమకొండ(ఆంధ్రజ్యోతి)/కాజీపేట, జనవరి 20: టెక్నోజియాన్‌లో భాగంగా నిట్ క్యాంపస్‌లో ప్రదర్శనగా పెట్టిన పలు సాంకేతిక ఎగ్జిబిట్లు విద్యార్థును విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ హాళ్లలో, క్యాంపస్ ఆవరణలో వీటిని నిర్వహించారు. నిట్ విద్యార్థులతో పాటు నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు స్వయంగా రూపొందించిన సైన్స్ ఎగ్జిబిట్లు సైతం టెక్నోజియాన్‌లో సందర్శనార్థం పెట్టారు. టెక్నోజియాన్ అంటే ఉన్నత సాంకేతిక విద్యా సంస్థల విద్యార్థులకే పరిమితం చేయకుండా పాఠశాల స్థాయిలో సైన్స్ పట్ల ఆసక్తి కలిగిన ఔత్సాహిక విద్యార్థులను సైతం ప్రోత్సహించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు టెక్నోజియాన్‌లోని ఈవెంట్లు, ఎగ్జిబిట్లను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీనితో నిట్ క్యాంపస్ విద్యార్థులతో సందడిగా మారింది. అడుగడుగునా సాంకేతిక సౌరభాలు గుబాళించాయి. ఉదయం 9 గంటల నుంచే టెక్నోజియాన్ కార్యక్రమాలు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగాయి.

వర్క్‌షాపులు

ఒకపక్క ఈవెంట్ల నిర్వహణతో పాటు మరోపక్క వివిధ అంశాలపై వర్క్‌షాపులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో వైజ్ఞానిక ప్రసంగాలు కూడా కొనసాగాయి. ఎలక్ట్రికల్ వెహికిల్ మోడలింగ్, సిమ్యులేషన్‌పై వర్క్‌షాపును ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు నిర్వహించారు. వీరు మ్యాట్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి సిమ్యులేషన్ ద్వారా ఎలక్ట్రికల్ వాహనాన్ని ఎలా రూపొందించాలో విద్యార్థులకు ప్రదర్శన రూపకంగా వివరించారు. దీనితో పాటు రాపిడ్ ప్రోటోటైపింగ్, 3డి ప్రింటింగ్‌పై నిర్వహించిన మరో వర్క్‌షాపు కూడా విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నది. మెకానికల్ ఇంజనీరింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాపులో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్యాప్చర్ ఎక్స్ అనే సైబర్ భద్రతపై ప్రాథమిక అవగాహనకు శిక్షణనిచ్చే మరో వర్క్‌షాపు కూడా ఈ టెక్నోజియాన్‌కే హైలైట్. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ సొసైటీ ఈ వర్క్‌షాపును సమన్వయం చేసింది.

వైజ్ఞానిక ప్రసంగం

రెడ్‌బస్ జర్నీపై రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం ఇచ్చిన అతిథి ఉపన్యాసం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ ప్రసంగం విని చాలా మంది విద్యార్థులు స్ఫూర్తి పొందారు. రెడ్‌బస్ జర్నీ ప్రస్థానంలో ఎదురైన సవాళ్లు, ప్రతిఘటనలు, విజయాలపై ప్రకాశ్ సంగం సుదీర్ఘంగా ప్రసంగించారు. విద్యార్థులు ఆయనతో కలిసి ఫొటో దిగేందుకు ఉత్సాహం చూపారు. తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



పింగ్ పాంగ్ లాంచర్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

రెండో రోజు ఈవెంట్లు

ఇన్‌సైట్ ఎక్స్, క్యాప్చర్ ఎక్స్, పరిష్కార్, ఆటో ప్రాగస్, వెహికిల్ డెమోన్‌స్ట్రేషన్, డిబగ్గింగ్ మానియా, ఇన్నోవేటివ్ స్పీయర్ ఎక్స్‌పో, విర్చువల్ వరల్డ్, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, కెమ్ ఈ కేస్, కెమ్ ఈ లిబ్రింత్, సైన్స్ ఎక్స్‌పో, కెమ్ ఫైర్, కెమ్ స్టోరీ, ఎక్స్‌పర్ట్ లెక్చర్, లేజర్ బేస్డ్ గేమ్, ఇన్నోవేటివ్ పెయింటింగ్, మ్యాథ్స్ అండ్ రేట్స్ ఆర్కాడీరియమ్, మైండ్ గ్రైండ్, మెటల్లస్, మెటా రష్, పేపర్ ప్రజంటేషన్, ఎలక్ట్రిక్ ఎక్స్‌పో, రెసిస్టెన్స్ రిలే రేస్, పీజో పవర్ ఆర్కేడ్ నిర్వహించారు. స్పాట్‌లైట్ ఈవెంట్ల విభాగంలో వీఆర్ క్రికెట్, ఎస్కేప్ రూమ్ 1, ఎస్కేప్ రూమ్ 2, ఆర్ బగ్గీ నిర్వహించారు. వీటితో పాటు స్టాడ్‌ప్రో, మ్యాట్‌ల్యాబ్ విని యోగించడం ద్వారా ఈవి స్టిమ్యులేషన్‌పై వర్క్‌షాపులు జరిగాయి. డాక్టర్ నిపట్లపల్లి నర్సమ్మ గెస్ట్ లెక్చర్ ఇచ్చారు.

నేడు విజేతల ఎంపిక

వరంగల్ నిట్‌లో జరుగుతున్న టెక్నోజియాన్‌లో భాగంగా చివరి రోజైన ఆదివారం ఈవెంట్లతో పాటు వర్క్‌షాపులు, గెస్ట్‌లెక్చర్లు కూడా ఉంటాయి. సాయంత్రం 6 గంటలకు ఆడిటోరియంలో ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఇందులో టెక్నోజియాన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాల ప్రదానం ఉంటుంది.

త్రీడీ ప్రింటర్

బ్యాడ్జీలు, కీచైన్లను ముద్రించడానికి ఉపయోగించే ప్రింటర్ ఇది. స్కూల్ విద్యార్థుల బ్యాడ్జీలను కానీ, వివిధ కంపెనీల కీచైన్లు, ఇతరత్రా లోగోలను డిజైన్‌చేసి దానిని కంప్యూటర్‌కు అనుసంధానం చేయడం ద్వారా కొద్ది నిమిషాల్లోనే వాటిని ముద్రణలోకి తీసుకురావచ్చు. దీనివల్ల ఖర్చు తక్కువ. సమయం కూడా వృథాకాదు. త్రీడీ ప్రింటర్‌ను పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.



ఆర్టిమేనియా



ఇది నైపుణ్యంతో రోబోలను నిర్ణీత గమ్యస్థానం వరకు నడిపే ఈవెంట్. ఇందులో పాల్గొనే వారు తమ రోబోలతో పాల్గొనాల్సి ఉంటుంది. రోబోలు నడిపే మార్గంలో అనేక అడ్డంకులు ఉంటాయి. వాటిని అధిగమిస్తూ నిర్ణీత గమ్యానికి రోబోలను ఎవరైతే విజయవంతంగా నడిపిస్తారో వారే విజేతలు.

పోటా పోటీగా ఈవెంట్లు

● వినూత్న రీతిలో నిర్వహణ ● ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్‌లో భాగంగా ప్రదర్శిస్తున్న పలు ఈవెంట్లు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. విద్యార్థులు ఈవెంట్లలో పోటాపోటీగా పాల్గొంటున్నారు. విజేతలుగా నిలవడానికి శ్రమిస్తున్నారు. ఈవెంట్లలో మచ్చుకు కొన్ని...

ఈపీవీ రేసింగ్



టెక్నోజియాన్‌లోని రెండు అక్షరాలు టీజెడ్‌తో ఒక డిజైన్‌ను రూపొందించారు. ఈ డిజైన్‌లో గీతలను తాకకుండా రోబో లను నడపాలి. ఇలా ఎవరైతే నడుపుతా రో వారే విజేతలు. నగదు బహుమతిని అందచేస్తారు. ఈ ఈవెంట్‌లో 40మందికి పైగా విద్యార్థులు రోబోలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రోబోలను చాకచక్యంగా నడపడమే ఈ ఈవెంట్ లక్ష్యం

ఆల్ టెర్రేయిన్ వాహనం



వరంగల్ నిట్‌లోని మెకానికల్ విద్యార్థులు స్వయంగా రూపొందించిన ఈ ఆల్ టెర్రేయిన్ వాహనం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొండలు, గుట్టలు, ఇతర ఎత్తైన ఏ ప్రాంతంలోనైనా ఈ వాహనం నడవగలుగుతుంది. ఇటీవల నిర్వహించిన వాహనాల ప్రదర్శనలో దీనికి రూ.15వేల నగదు బహుమతి కూడా లభించింది. ప్రస్తుతం సింగిల్ సీటర్ వాహనాన్ని రూపొందించారు. దీనిని తయారు చేయడానికి రూ.10లక్షల వరకు ఖర్చయింది. ఇందులో ఉపయోగించిన విడిభాగాలన్నీ విద్యార్థులే స్వయంగా తయారు చేశారు.

పియోజ్ పవర్ ఆర్కాడ్



వరంగల్ నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సొసైటీ వారు ఈ పరికరాన్ని రూపొందించారు. వ్యక్తుల శక్తిని అంచనా వేయడానికి రూపొందించిన పరికరం ఇది. పీజోమెటీరియల్‌తో ప్యాడ్‌ను రూపొందించారు. దీనిపై సుత్తితో ఒక మనిషి కొడితే ఉత్పన్నమయ్యే శక్తిని పీజోమెటీరియల్ సర్క్యూట్ రికార్డు చేసి దానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రదర్శిస్తుంది. మెకానికల్ ఎనర్జీని ఎలక్ట్రికల్ ఎనర్జీగా మార్చడమే ఈ పరికరం ముఖ్య ఉద్దేశ్యం.

పిక్సల్ నుంచి పోర్ట్రేయిట్‌లు



కంప్యూటరైజ్డ్ న్యూమెరికల్ కంట్రోలర్ మెషీన్ నిజమైన ఇమేజ్‌ను రూపొందించడమే ఈ ఈవెంట్ ముఖ్య ఉద్దేశం. సాధారణంగా ఒక వ్యక్తి చిత్రాన్ని పెన్సిల్‌తో లేదా రంగులతో చేయితో వేస్తాం. లేదా ఫొటో తీస్తాం. కానీ ఇక్కడ ఒక వ్యక్తి చిత్రాన్ని న్యూమెరికల్ కంట్రోలర్ మెషీన్ కంప్యూటర్ సహాయంతో నిజమైన ఇమేజ్‌గా కొద్ది సెకండ్లలో రూపొందిస్తుంది.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధిక నిధులు

▸ ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తాం

▸ రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జనవరి 20 : రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో ఆడంబరాలు, ఆర్భాటాలే తప్ప.. అభివృద్ధిని ఆచరణలో చూపలేదని విమర్శించారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి అంశంపై హనుమకొండలోని కలెక్టరేట్‌లో సమీక్ష జరిపారు. సమీక్ష అనంతరం మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు తమ స్వార్థప్రయోజనాల నెరవేర్చుకునేందుకే పాలన సాగించారన్నారు. అంతేకానీ.. ప్రజలకు, నియోజకవర్గాలకు ఉపయుక్తమయ్యే అభివృద్ధిని సాధించలేదేని విమర్శించారు. ప్రతీ ప్రాజెక్టు ప్రకటన వెనుక స్వలాభం చూసుకున్నారని ఆరోపించారు. ఆ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో కానీ, ప్రజలకు ఉపయోగపడేలా మలచడంలో నిజాయితీగా వ్యవహరించలేదని మండిపడ్డారు. ప్రతీ శాఖలో ఇదేతీరు నెలకొందన్నారు. వీటన్నింటినీ కూలంకశంగా సమీక్షించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో ప్రకటించిన ప్రాజెక్టుల వల్ల ప్రజలకు జరిగే మేలు, నిధుల వ్యయం, వాటి పూర్తి తదితర అంశాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా కాంగ్రెస్ పాలన సాగుతుందన్నారు. ప్రజాపాలన ద్వారా సేకరించిన దరఖాస్తుల కంప్యూటీకరణ తదుపరి అమలు ప్రక్రియ ఉంటుందన్నారు.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ నగరాభివృద్ధి కోసం ప్రజాభిప్రాయానికి అనుగుణమైన మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయనున్నట్లు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ నేతలు తమ స్వార్థ ప్రయోజనాలు, భూములకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించారని ఆరోపించారు. దీనిని ప్రక్షాళన చేసి సమగ్ర సవరణలతో నగరాభివృద్ధి, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని అమోదయోగ్యమైన మాస్టర్‌ప్లాన్ తీసుకొస్తామన్నారు. ఇందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. నగరంలో త్వరలోనే రెండు పడక గదుల పంపకాన్ని చేపడతామన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇళ్ల లేని పేదలకు ఇళ్ల స్థలం, రూ.5 లక్షలు అందచేస్తామన్నారు.

మేడారం జాతరకు రూ. 105 కోట్లు

మేడారం జాతర నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.105కోట్లు కేటాయించిందని మంత్రి సీతక్క వెల్లడించారు. తొలుత రూ.75 కోట్లు ప్రకటించామని, మరో రూ.30 కోట్లు కూడా జాతర నిర్వహణకు ఇవ్వనున్నట్లు చెప్పారు.

కాళోజీ కళాక్షేత్రానికి పదేళ్లా..?

బీఆర్ఎస్ పాలన ఎంత స్వార్థరహితమో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రమే నిదర్శనమని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ప్రగతిభవన్ 8నెలల్లో పూర్తయ్యిందని, కాళోజీ కళాక్షేత్రం మాత్రం పదేళ్లు గడిచినా పూర్తి కాలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన కళాక్షేత్రాన్ని తాము పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

కాలువల అభివృద్ధికే మోక్షం లేదు..

ఇరిగేషన్ ప్రాజెక్టు పేరిట బీఆర్ఎస్ బీరాలు పలికిందని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని, పచ్చని తెలంగాణగా మారుస్తామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు నీటి మూటలయ్యాయని దుయ్యబట్టారు. ఇరిగేషన్‌పరంగా తెలంగాణను ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలుపుతామని ప్రగల్భాలు పలికిన బీఆర్ఎస్.. కనీసం ప్రధాన కాలువలను అభివృద్ధి చేయలేదని విమర్శించారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు అస్తవ్యస్తంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇరిగేషన్ రంగంపై ప్రత్యేక దృష్టితో ఉందన్నారు. బీఆర్ఎస్‌లా కాకుండా పక్కా ప్రణాళికలతో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వెల్లడించారు.

కబ్జారాయుళ్లను వదలం

ప్రభుత్వ భూములను దొడ్డిదారిన కాజేసిన బీఆర్ఎస్ నేతలను వదలమని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. కబ్జారాయుళ్లు ఎంతటి వారైనా సరే చర్యలు ఉంటాయన్నారు. అన్యాక్రాంతమైన భూములను జీవో 59 ద్వారా అర్హులైన పేదలకు అందచేస్తామన్నారు.

ప్రజలు పండబెట్టారు..

పులి వస్తోంది.. అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నకు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పులి వంద మీటింగ్‌లు పెట్టింది.. ఏం జరిగింది.. ప్రజలు పండబెట్టారంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించిన సంగతి గుర్తించాలన్నారు. ఇక జనవరి నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించొద్దనే ప్రకటనలు చేస్తూ మాజీ మంత్రి కేటీఆర్ తెగ బాధపడుతున్నారని శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చిన సంగతి, దానిని అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు ఉందని సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందన్నారు.

ప్రజా పాలనకు అర్థం కాంగ్రెస్

ప్రజాపాలన అనే దానికి పరిపూర్ణ అర్థం కాంగ్రెస్ అని మంత్రి సురేఖ వెల్లడించారు. అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్ పాలనలోనే జరిగిందన్నారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్న సంతోషం ప్రజల్లో స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. ఒక్కో నియోజకవర్గంలో అలవికాని విధంగా రూ.300 కోట్లకు పైగా అభివృద్ధి పనులంటూ ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ నిధుల విషయంలో కూడా బీఆర్ఎస్ అనాలోచితంగా వ్యవహరించిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో బిల్లులు లేక సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న సంగతి కేటీఆర్ గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆయనకు సర్పంచ్‌ల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, యశస్వినీరెడ్డి, మురళీనాయక్ పాల్గొన్నారు.

సర్కారు లక్ష్యాలు నెరవేర్చండి..

(5వ పేజీ తరువాయి)

గుర్తుచేశారు. అందరం సమష్టి కృషితో జాతర విజయవంతంగా పూర్తి చేద్దామన్నారు. రామప్ప, లక్నవరం సరస్సుల అనుసంధానం కోసం భూసేకరణ జరిగిందన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలన నిర్బంధంలో సాగిందని, ఉద్యోగులు ఒత్తిడికి గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరి సంక్షేమాన్ని కోరేదని, స్వేచ్ఛగా ప్రజలకు సేవలు అందించండని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలని, నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. ఇందులో ఎలాంటి వివక్షకు తావులేదన్నారు. బీఆర్ఎస్ స్వార్థపాలన ముగిసిందని, ప్రజలు కోరుకున్న ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అభివృద్ధి ఫలాలను ఆచరణలో చూపాలని కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్ మహానగరాభివృద్ధి కోసం జీడబ్ల్యూఎంసీకి అధిక నిధులు కేటాయించాలని కోరారు. పశ్చిమలో కబ్జాకు గురైన చెరువులు, కుంటల పరిరక్షణ జరగాలన్నారు. అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. ఎవరికి భయపడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. మడికొండ డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. డంపింగ్ యార్డులో పొగ కారణంగా పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. విలీన గ్రామాల్లో సమస్యలు నెలకొన్నాయని, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సేవలు మెరుగ్గా అందించాలని సూచించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని మూడు డివిజన్లు పరకాల నియోజకవర్గంలో ఉన్నాయని వీటి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అన్నారు. నిధులు కేటాయించాలని కోరారు.

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

ఫైర్ అయ్యారు. ఎవరిని పిలవాలో.. ఎవరిని వద్దనాలో.. తమకు తెలుసని.. ఇదేం మీ ప్రభుత్వం కాదంటూ మంత్రి పొన్నం ఫైర్ అయినట్లు తెలిసింది. అంతలోనే మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ విషయంలో అధికారుల తీరుపై విచారణ జరిపిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి చెప్పినట్లు తెలిసింది. అంతటితో పరిస్థితి సద్దుమణిగింది.

సమీక్షకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల దూరం

హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు డాక్టరు బండా ప్రకాశ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్‌లకు సమాచారం లేనట్లు తెలిసింది. ఈ విషయమై వారు అధికారుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

అభివృద్ధి పనులపై నజర్

▸ వివిధ ప్రాంతాలను సందర్శించిన మంత్రి పొంగులేటి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 20: వరంగల్ నగర పర్యటనకు శనివారం వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నగరాభివృద్ధి ప్రణాళికలు, పనులను పరిశీలించారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని పెద్దపెండ్యాల కరుణాపురం జంక్షన్ వద్ద మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు స్వాగతించారు. అనంతరం కరుణాపురం వద్ద జంక్షన్ నిర్మాణం, స్వాగత తోరణం, రింగ్ రోడ్డు బ్రిడ్జి మీదుగా హైదరాబాద్-హనుమకొండ జాతీయ రహదారికి అనుసంధానంగా ఫ్లైఓవర్ నిర్మాణం అంశాలను శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. హైదరాబాద్ నుంచి వరంగల్‌కువెళ్లే రోడ్డు మార్గం సరిగ్గా లేదని ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయం మేరకు మంత్రులు సందర్శించారు. సంబంధించిన మ్యాప్‌ను మంత్రులకు వివరించారు. అనంతరం రోడ్డు మార్గం లోపాలను సమగ్ర వివరాలతో నివేదికను సిద్ధం చేయాలని హైవే అథారిటీ, కుడా అధికారులను మంత్రి ఆదేశించారు. వరంగల్‌కు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం ఉండే విధంగా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టరేట్‌లో సమీక్ష జరిపారు. అక్కడి నుంచి సాయంత్రం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.



హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నిర్మాణాలను మంత్రులకు వివరిస్తున్న గృహ నిర్మాణ మండలి, రామ్‌కీ ఇన్‌ఫ్రా అధికారులు

అనంతరం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని రాంకీ గేటెడ్ కమ్యూనిటీలో రాంకీ నిర్మించి తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ మండలికి అప్పగించిన అల్పాదాయ వర్గాల 102 గృహాల సముదాయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ నిర్మాణాల వివరాలను తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ మండలి ఈఈ రాధాకృష్ణ (హైదరాబాద్), రాంకీ ఇన్‌ఫ్రా ఏజీఎం అనిల్‌లు మంత్రులు శ్రీనివాసరెడ్డి, సురేఖలకు వివరించారు. నిర్మాణాలను నాణ్యతతో సత్వరం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

రేపు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంజిరాల నాగరాజు, గుడిబోయినగోపికృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మానుకోటలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22న పండుగ వాతావరణం ఉంటుందని, ఇప్పటికే కేంద్రప్రభుత్వ పరిధిలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారని, జిల్లాలోని విద్యాసంస్థలకు కూడాసెలవు ప్రకటించాలని కోరారు.

మిల్లు హమాలీ కార్మికుల రేట్లు పెంపు

మహబూబాబాద్ టౌన్, జనవరి20 : మిల్లు హమాలీ కార్మికుల రేట్లను పెంచడం జరిగిందని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ నేతలు కుమ్మరికుంట్ల నాగన్న, రేషపల్లి నవీన్, పర్వత కోటేష్ తెలిపారు. మహబూబాబాద్‌లో శనివారం మిల్లు యాజమాన్యాలు, కార్మిక సంఘాల నాయకులు మంగీలాల్ మిల్లులో హమాలీ రేట్లపై చర్చించి గతంలో ఉన్నదానికంటే 12 శాతం పెంచుతూ ఇరువురి మధ్య ఒప్పందం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మిల్లు యజమానులు గోపాల్, మదన్, నవనీత్, నర్సింహారావు, దామోదర్, యూనియన్ నాయకులు గొడుగు గుట్టయ్య, వెంకన్న, పర్వతాలు, రాంమ్మూర్తి, సోమయ్య పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలిగా లక్ష్మీబాయి



నెహ్రూసెంటర్, జనవరి20 : లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మహిళవిభాగం జిల్లా అధ్యక్షురాలిగా భూక్య లక్ష్మీబాయిని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు మండలం లక్ష్మీతండాకు చెందిన భూక్య లక్ష్మీబాయి గత కొన్ని సంవత్సరాలుగా లంబాడీల జరుగుతున్న పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నందున ఆమెసేవలను గుర్తించి, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా బాధ్యతలుఅప్పగించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా, జాతీయ నాయకులకు లక్ష్మీబాయి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కమిటీ ఏర్పాటు పట్ల హర్షం

నెహ్రూసెంటర్, జనవరి 20 : ఎస్సీ వర్గీకరణ కోసం ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకు కమిటీని నియమించడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కేటీఆర్ కాలనీలో శనివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ అమలుకు ప్రధాని మోదీ నాయకత్వంలో ముందడుగు వేయడం హర్షనీయమన్నారు. బాలకృష్ణ, సమ్మయ్య, హన్మంతు, సత్యపాల్, సీహెచ్.రాధ, సుధారాణి, రజిత, ఎల్లమ్మ, పద్మ, మల్లయ్య వెంకన్న పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌లో నర్సిరెడ్డికి డాక్టరేట్



సీరోలు, జనవరి 20 : మండలంలోని కాంపెల్లి గ్రామానికి చెందిన చింతకుంట్ల నర్సిరెడ్డి ఇంగ్లీష్‌లో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. హైదరాబాద్‌లో చైతన్యడీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ దామోదర్ చేతుల మీదుగా శనివారం నర్సిరెడ్డి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. చింతకుంట్ల వెంకన్న, వెంకటమ్మ దంపతుల కుమారుడు నర్సిరెడ్డి 'మెథడాలజీ ఇంటర్ ప్రిటెషన్స్ ఆఫ్ ఇండియన్ లైన్ ఇన్ ది సెలెక్ట్ నోవెల్స్ ఆఫ్ దేవదత్ పట్నాయక్' అనే అంశంపై వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జి.దామోదర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశాడు. దీంతో ఆయన డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కాంపల్లిలో డాక్టరేట్ పట్టాను అందుకున్న తొలివ్యక్తిగా నర్సిరెడ్డి కావడంతో గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు. నర్సిరెడ్డి ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

రేపు చెకుముకి సైన్స్ సంబురాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 20 : జిల్లాలో ఈనెల 22న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాలస్థాయిలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబురాల పోటీలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తడకమల్ల బ్రహ్మం, లింగంపల్లి దయానంద్, కన్వీనర్ విజయ్‌రాజ్ శనివారం తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్, సాంఘికశాస్త్రం అంశాలతో ప్రశ్నాపత్రం ఉంటుందన్నారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలోపరీక్ష రాయవచ్చన్నారు. ఈ పోటీల్లో అత్యధిక సంఖ్యలో పాల్గొనే ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు.

టీఎంఎఫ్ ఆధ్వర్యంలో గణిత పోటీ పరీక్షలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 20 : తెలంగాణ గణితఫోరం (టీఎంఎఫ్) మహబూబాబాద్ మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్‌ఎస్ కంకరబోడ్‌పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి గణిత పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లీష్ మీడియం నుంచి ప్రథమస్థానంలో జడ్పీహెచ్‌ఎస్ ఈదులపూసపల్లి విద్యార్థిని ఎల్.నిఖిత, ద్వితీయస్థానంలో కంబాలపల్లి విద్యార్థిని ఎ.సాజని, తృతీయ స్థానంలో కంబాలపల్లి విద్యార్థి పి.కౌశల్, తెలుగు మీడియం నుంచి పర్వతగిరి విద్యార్థులు జె.హారిక, జె.స్రవంతి, జి.శ్రావ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుచుకున్నారు. వారికి టీఎంఎఫ్ బాధ్యులు నగదు ప్రోత్సాహంతో మెమోంటోలు అందజేశారు. టీఎంఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నట్టి రవి, కె.శ్రీనివాస్, జిల్లా శాఖ నుంచి శ్రీనివాసరావు, ఆర్.శ్రీధర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కోట్య పాల్గొన్నారు.

● కురవి : గణితంలో రాణించిన విద్యార్థులు జీవితంలో ఖచ్చితంగా స్థిరపడతారని అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ అన్నారు. కురవి జడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం మండలస్థాయి గణిత ప్రతిభ పరీక్ష (టీఎంఎఫ్)ను నిర్వహించారు.బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ బహుమతి కురవి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శ్రీరాం, ద్వితీయ బహుమతి మోదుగులగూడెంకు చెందిన నితిన్, తృతీయ బహుమతి ప్రేమ్‌కుమార్, తెలుగు మీడియంలో గుండ్రాతిమడుగుకు చెందిన విద్యార్థిని ఎస్.నవ్య, ద్వితీయ బహుమతిని జి.వర్షిత, తృతీయ బహుమతిని ఎల్.శేఖర్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో గణితఫోరం జిల్లా అధ్యక్షుడు వి.సీతారాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.మాధవాచారి, ప్రధాన కార్యదర్శి జి.నర్సింహాచారి, సమన్వయకర్త డి.మల్లికార్జున్, గణితపాధ్యాయులు శంకర్, ఇందిర, హెచ్‌ఎం వహీద్, ఎం.శ్రీధర్, డి.వెంకన్న, ఎస్.వి జయలక్ష్మి, వి.విజయరాజ్, కుమారస్వామి, కళావతి పాల్గొన్నారు.



కురవిలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్

● కేసముద్రం : మండలంలోని కల్వల జడ్పీహైస్కూల్లో తెలంగాణ గణితఫోరం మండల శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ పరీక్షకు ఎనిమిది జడ్పీ, మోడల్ స్కూళ్ల నుంచి 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబర్చిన ముగ్గురికి ఈనెల 22న తొర్రూరు ఆర్యభట్ట పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని ఆ ఫోరం మండల అధ్యక్షుడు తండ సదానందం తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండారు నరేందర్, ఆకుల మధు, కె.రమేష్, ఎం.ఏకాంబరం, ఎం.భీముడు, జి.వెంకటగిరి, అరుణకుమారి పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, తద్వారా బంగారు భవిష్యత్ ఉంటుందని జడ్పీహెచ్‌ఎస్ ఇనుగుర్తి పాఠశాల హెచ్‌ఎం రూపారాణి అన్నారు. విద్యార్థులు గణిత ప్రాధాన్యతతో నిర్వహించే పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్షల్లో సులభంగా సీటు సాధించేందుకు వారికి గణిత టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గణితంలో ఎక్కువ సాధన చేయడం ద్వారా అత్యధిక మార్కులు సాధించడమే కాకుండా సులభంగా సీటు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం టి.సంతోష్, ఎం.ముఖేష్, జి.రుష్మిత ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో సమ్మిరెడ్డి, నరేందర్, కిషన్, యాకయ్య, యాదగిరి, ప్రవీణ్ పాల్గొన్నారు.

'అన్యాయం జరుగకుండా చూడండి'

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 : వలిగొండ నుంచి భద్రాచలం వరకు నిర్మించే జాతీయ రహదారి 930పి ద్వారా రైతులు, నిరుపేదలు, గిరిజనులకు అన్యాయం జరుగకుండా చూడాలని డీసీసీ ఉపాధ్యక్షులు నీరుటి లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సచివాలయంలో ఆర్‌అండ్‌బీ శాఖ మాత్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. మానుకోటలో బీఆర్‌ఎస్ నేతలకనుగుణంగా ఎన్‌హెచ్930పి అలైన్‌మెంట్‌ను మార్చుకున్నారని మంత్రికి వివరించినట్లు చెప్పారు. తద్వారా రజాలిపేట సమీపంలోని రైతుల భూములు, సాలార్‌తండ వద్ద గిరిజనుల ఇండ్లు, అనంతారం రోడ్డులో నిరుపేదలు ఇంటి స్థలాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని మంత్రికి వివరించగా అందుకు సానుకూలంగా స్పందించి న్యాయం చేసేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్యాణ్, బాలాజీ, గుగులోతు రాము, భాస్కర్, నీరుటి రమ్య పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న మానుకోట వాసులు

'ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి'

తొర్రూరు, జనవరి 20 : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఉద్యోగులు తనకు మద్దతుగా నిలిచారని, కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి అండగా ఉంటుందన్నారు. సంఘం నాయకులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దుకై తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. పీఆర్టీయూ నాయకులు సతీష్ రెడ్డి, విప్లవ్‌రెడ్డి, ముత్తిలింగం, యాకయ్య, అశోక్, రమేష్, రేణుక, వేణు మాధవ రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పీఆర్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

ఆధార్ కోసం జనం పాట్లు

గూడూరు, జనవరి 20 : తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం వద్ద శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలు నిరీక్షించారు. రోజుకు కేవలం 60 మందికి మాత్రమే ఆధార్‌లో చేర్పులు, మార్పులు చేస్తున్నారు. దీంతో ఆధార్‌లో చేర్పులు, మార్పులు నూతన ఆధార్ కార్డు కోసం వచ్చేవారు అవస్థలు పడుతున్నారు. అలాగే నిర్వహకుడు ఇదే అదనుగా భావించి, అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయంపై ఇటీవల ఎంసీపీఐ (యూ), యూఎస్‌ఎఫ్‌ఐ, లంబాడ హక్కుల పోరాట సమితి వేర్వేరుగా గ్రీవెన్స్‌తో పాటు తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందిస్తూ ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఈడీఎం) విచారణ చేపట్టేందుకు శనివారం తహసీల్దార్ కార్యాలయంకు చేరుకున్నారు. ఎంసీపీఐ (యూ) రాష్ట్ర నాయకుడు పానుగంటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, బీజేపీ జిల్లా మాజీ కార్యదర్శి బత్తుల లక్ష్మణ్ ఆధార్ సెంటర్ నిర్వాకుడు అధిక మొత్తంలో ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సోమవారం పూర్తి విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని మేనేజర్ ప్రశాంత్ స్పష్టం చేశారు.

ఎంపీగా అవకాశం కల్పించాలి

● రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపదాస్ మున్షీకి రాయపురం సాంబయ్య విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 : గిరిజన రిజర్వ్‌డ్ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం కల్పించాలని ఆ పార్టీ నాయకుడు రాయపురం సాంబయ్య విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీని కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం తనకు ఎంపీగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ పటిష్టతకు పని చేస్తున్నానని చెప్పారు. గతంలో భద్రాచలం నియోజకవర్గం నుంచి ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కమలాకుమారి రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యురాలుగా, కేంద్ర మంత్రిగా పని చేశారని గుర్తు చేశారు. ఎరుకల సామాజిక వర్గానికి చెందిన తనకుఅవకాశం కల్పించి న్యాయం చేయాలని కోరారు.

బాలికల ఉన్నత పాఠశాల తనిఖీ

గూడూరు, జనవరి 20 : గూడూరు బాలికల ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి రామరావు అకస్మీకంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఇన్‌చార్జి హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, శోభన్‌రెడ్డి, శ్రీలత, రమాదేవి, జయశ్రీ, భారతి పాల్గొన్నారు.

స్వేరోస్ జిల్లా అధ్యక్షుడిగా యాదగిరి

గూడూరు, జనవరి 20 : స్వేరో జిల్లా అధ్యక్షుడిగా గూడూరు మండలం గాజులగట్టు గ్రామానికి చెందిన కామగాని యాదగిరిని ఎన్నుకున్నట్లు స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని వీరన్న, ప్రకాష్ శనివారం తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నెమ్మతి రమేష్, ట్రెజరీగా సురేందర్, ఉపాధ్యక్షులుగా గౌతమ్, జాయింట్ సెక్రటరీగా మధు, ఆర్గనైజేషన్ సెక్రటరీగా అశోక్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.



కనకదుర్గ పారాబైల్డ్ రైస్ మిల్లులో బియ్యం పంపిణీపై విచారిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు

బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఎగుమతి చేయాలి

● డీఎస్‌వో రాజేందర్

దంతాలపల్లి, జనవరి 20 : ఈనెల 31వ తేదీ కల్లా పూర్తిస్థాయిలో సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఎగుమతి చేయాలని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి రాజేందర్ మండల కేంద్రం శివారు కనక దుర్గ ఆగ్రోటెక్ పారాబైల్డ్ యాజమాన్యానికి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ వోఎస్డీ ప్రభాకర్, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ క్రిష్ణవేణి మిల్లును శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైస్‌మిల్లులో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం లేదన్నారు. ఫై రైస్‌మిల్ యాజమాన్యం సర్కారు సుమారు 145 టన్నుల బియ్యాన్ని (సీఎంఆర్ బియ్యం) ఎఫ్‌సీఐకి ఎగుమతి చేయాల్సి ఉందన్నారు. సంబంధిత యాజమాన్యం సత్వరమే బియ్యం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరణ

గార్ల, జనవరి20 : మండల కేంద్రంలోని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు రాంకుమార్‌నాయక్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌లను పీఏసీఎస్ ఛైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ నేతృత్వంలో శనివారం ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌లను సంఘం బాధ్యులు విడుదల చేశారు. జడ్పీటీసీ ఝాన్సీలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు దనియాకుల రామారావు, గుండా వెంకట్‌రెడ్డి, బాపనపల్లి సుందర్‌కుమార్, గుగులోత్ శ్రీనునాయక్, రవినాయక్, హతీరాంనాయక్, బాబు, పీఆర్‌టీయూ నాయకులు సురేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, భూక్యా రమేష్‌రాథోడ్, పెద్ది పద్మావతి, మాజీ ఎంఈవో గుడి రాంప్రసాద్ పాల్గొన్నారు.

'ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమించాలి'

గార్ల, జనవరి 20 : ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు శాపంగా మారిన నూతన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసే వరకు ఉద్యోగులు సంఘటితంగా ఐక్యంగా ఉద్యమించాలని టీఎస్‌టీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గంగావత్ ఈరునాయక్, గంగావత్ భాస్కర్‌నాయక్, అడపాల ప్రసాద్, బాధవత్ శ్రీను, శ్రీనునాయక్, రమేష్, పాల్గొన్నారు.

పీఎంజీఎస్‌వై రోడ్డు తనిఖీ

డోర్నకల్, జనవరి 20 : మండలంలోని ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు నుంచి ముల్కలపల్లి వరకు 13 కిలోమీటర్ల పొడవుతో రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) రోడ్డును శనివారం జాతీయ గ్రామీణా రోడ్ల నిర్వహణ సంస్థ నాణ్యత తనిఖీ అధికారి లహన్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగానాణ్యత ప్రమాణాలు ఏ మేరకు ఉన్నాయో కొన్ని నమూనాలను సేకరించారు. ఆయన వెంట పీఆర్‌డీఈఈ జుంకీలాల్, ఏఈ శ్రీనివాస్, నిర్మాణ సంస్థ సూపర్‌వైజర్ రాజు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం

కురవి, జనవరి 20 : తాను, తమ పూర్వీకులు చదువుకున్న పాఠశాలకు జీవితకాలం ఏటా నగదును అందిస్తానని కురవి దేవాలయ ధర్మకర్త కన్నెగంటి వెంకటరమణ-పద్మావతి దంపతులు అన్నారు. సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ఏటా రూ.3,601 జీవించి ఉన్నంత కాలం ఆర్థిక వితరణ అందిస్తానని తెలిపారు. తన తల్లిదండ్రులు కన్నెగంటి వీరభద్రయ్య-సౌభాగ్యమ్మ, బాబాయ్, తెలంగాణ సాయుధ పోరాట యోధులు కన్నెగంటి బద్రినారాయణ జ్ఞాపకార్థం నగదును అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఆర్థిక వితరణ పత్రం పాఠశాలకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దారావత్ వెంకన్న, ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్‌కుమార్, విజయ్, అంజాద్‌పాషా, సంధ్యారాణి, సురేష్ పాల్గొన్నారు.

స్కూళ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

డోర్నకల్, జనవరి 20 : మండలంలోని ఉయ్యాలవాడ ప్రాథమికోన్నత పాఠశాల, ముల్కలపల్లిని జడ్పీ హైస్కూల్‌ను శనివారం అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ సందర్శించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నందున పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట డోర్నకల్ తహసీల్దార్ నాగభవాని, ఆర్ఐ రామ ఉన్నారు.

డోర్నకల్ పీఆర్‌డీఈఈగా జుంకీలాల్



డోర్నకల్, జనవరి 20 : పంచాయతీరాజ్ డోర్నకల్ సబ్ డివిజనల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ)గా జుంకీలాల్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో జుంకీలాల్ డోర్నకల్ పీఆర్ ఏఈగా పనిచేశారు. తర్వాత ఘన్‌పూర్, మెదక్ జిల్లా తుప్రాన్ ఏఈగా పనిచేశారు. డీఈగా పదోన్నతిపై డోర్నకల్ సబ్ డివిజన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ వీరన్న, కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, సుమీర్‌చంద్‌జైన్ డీఈకి అభినందనలు తెలిపారు.

సైడ్ డ్రైనేజీ పనుల ప్రారంభం

కురవి, జనవరి 20 : మండలంలోని చీమ్లాతండా జీపీ పరిధిలోని బంగ్యాతండాలో ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో సైడ్ డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను శనివారం ఎంపీపీ గుగులోతు పద్మావతి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తండాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. సర్పంచ్ భూక్య మంగీలాల్, గుగులోతు రవినాయక్, భూక్య బంగ్యానాయక్, దారావత్ రాధాకృష్ణ, చింగానాయక్, రవినాయక్, బిచ్చానాయక్ పాల్గొన్నారు.

డోర్నకల్‌లో ఘనంగా కలశపూజ



కలశలతో నూతన జైన్ మందిరానికి తరలిస్తున్న మహిళలు

డోర్నకల్, జనవరి 20 : ఈనెల 22న డోర్నకల్‌లో నూతనంగా నిర్మించిన జైన మందిర ప్రారంభోత్సవ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఘటయాత్ర (కలశపూజ) నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు 108 కలశలను ఎత్తుకుని మహవీరుని జైన మత కీర్తనలు ఆలపిస్తూ నూతన మందిరం వద్దకు చేరుకున్నారు. అనంతరం నూతన జైన మందిరంలో వాస్తు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మత పెద్దలు మహేందర్‌జైన్, కిశోర్‌జైన్, సుమీర్‌చంద్‌జైన్, అశోక్ జైన్, యశోదర్‌జైన్, సంతోష్‌జైన్, ప్రఫుల్‌జైన్, నరేష్‌జైన్ పాల్గొన్నారు.

'బాలల అక్రమ రవాణాను అరికట్టాలి'

మరిపెడ రూరల్, జనవరి 20 : బాలల అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ మండల కోఆర్డినేటర్ నిరుడు శిరీష అన్నారు. శనివారం అబ్బాయిపాలెం బాలల అక్రమరవాణాపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలను చట్టరీత్యా నేరమన్నారు. మహిళలపై వేధింపులు జరిగినప్పుడు క్రైంబాంచ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. టోల్ ఫ్రీనెంబర్ 100, 1098, 1930లకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామసమైక్య సంఘం సీఏ తీగల ఝాన్సీ లక్ష్మీబాయి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చన్న, నాగమణి, ఏకమ్మ, వెంకటమ్మ, శ్రీదేవి, లక్ష్మీ, పూలమ్మ, చంద్రమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

పెద్దవంగర, జనవరి 20 : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్ రావు అన్నారు. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన పల్లె సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, మల్లికార్జునచారి, గ్రామపార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, ఉపయ్య, మల్లయ్య, సుభాష్, ఐలయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

'గణితంలో పట్టు సాధించాలి'

పెద్దవంగర, జనవరి 20 : ప్రతీ విద్యార్థి శ్రీనివాసరామానుజన్ స్ఫూర్తిగా తీసుకుని గణితంలో పట్టు సాధించాలని తెలంగాణ గణిత ఫోరం మండల అధ్యక్షుడు కళాధర్, నోడల్ హెచ్‌ఎం బుధరపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శనలు, గణితశాస్త్రంపై క్విజు పోటీలను నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా రమేష్‌కుమార్, ప్రభాకర్, రాజలింగం, సదయ్య, గౌరిశంకర్, భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలు

చిన్నగూడూరు, జనవరి 20 : మండల కేంద్రంలోని చిన్నగూడూరు, ఉగ్గంపల్లి గ్రామాల్లో శనివారం అయోధ్య రాముని అక్షింతలతో భక్తులు శోభయాత్ర నిర్వహించి, ఆయా గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను రామనామస్మరణతో ఇంటింటికి పంపిణీ చేశారు. ఈనెల 22న రాముడి విగ్రహం ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతీ ఇంటికి అక్షింతలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపీటీసీ భర్తపురం ఉదయమ్మ కొమురెల్లి, డీఎస్ రాంసింగ్, గుగులోత్ సోమన్న, మాలోత్ నరేష్, నూకల గంగరాజు, కరుణాకర్, ముత్యం అంబరీష, ఉపేంద్రచారి, మల్లయ్య, యాకయ్య, రంజిత్, మధు, ఉప్పలయ్య, కలమ్మ, వరలక్ష్మి, మంగ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నర్సింహులపేట, జనవరి 20 : అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పట్టిక, బొలెరో వాహనాన్ని సీజ్‌చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు శనివారం ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రం శివారులో వాహన తనిఖీ చేస్తుండగా కర్ణాటక రిజిస్ట్రేషన్ గల బొలెరో వాహనం నల్ల పరదా కప్పుకొని అనుమానాస్పదంగా ఉంది. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా, గుడుంబా తయారీకి ఉపయోగించే 60 బస్తాలు (30 క్వింటళ్ల) నల్లబెల్లం, ఒక బస్తా పట్టిక 50 కేజీలు ఉన్నాయి. దీంతో వాహనాన్ని స్వాధీనపరుచుకొని సీజ్‌చేసి, చిత్తూరుకి చెందిన నారాయణ స్వామి, నెల్లికుదురుకి చెందిన గుగులోత్ లోలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. పట్టుబడిన బెల్లం విలువ రూ.3 లక్షలు ఉంటుంది. ఈ తనిఖీలో పీసీలు కృష్ణ, శ్రీనివాస్, రమేష్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

● మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు, జనవరి 20 : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పట్టణంలోని 7వవార్డు బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నెం రాములు తండ్రి మన్నెం సోమయ్య మృతదేహానికి నివాళులర్పించి మన్నెం రాములును ఓదార్చారు. పట్టణ కేంద్రానికి చెందిన టీవీ చానల్ విలేకరి బోగోజు సురేష్ గుండెపోటుతో మృతి చెందగా ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. చింతలపల్లి, కంటాయపాలెం గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు.ఎంపీపీ టీసీ అంజయ్య జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తొర్రూరు రూరల్, జనవరి 20 : తొర్రూరు మండలం పత్తేపురం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై కె.జగదీష్ కథనం మేరకు.చెర్లపాలెం గ్రామానికి చెందిన హనుమాండ్ల వాసుదేవరెడ్డి (42) తనవ్యక్తి గత పని నిమిత్తం తొర్రూరుకు నడిచి వెళ్తుండగా పత్తి లోడుతో వరంగల్ వైపు వెళ్తున్న అశోక లేలాండ్ వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య నవిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య నవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని

ముగ్గురిపై కేసు నమోదు

కొత్తగూడ, జనవరి 20 : ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు. కొనాపురం గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన వాగ్వివాదం దాడిలోకొమ్మనబోయిన ఏలేందర్, రాజబోయిన ఐలయ్య, రాజబోయిన అనుయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

వావిలాలలో అక్రమ లేఅవుట్‌ల తొలగింపు

నెల్లికుదురు, జనవరి 20 : వావిలాలలో అక్రమ లేఅవుట్‌లను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగిచారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారిపార్థసారథి మాట్లాడుతూ మహర్షి డెవలపర్స్ వారు అక్రమంగా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, డీపీవో ఆదేశాల మేరకు ప్లాట్లకు ఏర్పాటు చేసిన కనీలను జీపీ సిబ్బందితో తొలగించామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్లాట్లు చేస్తున్న డెవలపర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీల్లో విజేతకు కప్‌ను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేసముద్రం, జనవరి 20 : కేసముద్రం స్టేషన్‌లో కొద్దిరోజులుగా స్థానిక యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి కేపీఎల్-6 క్రికెట్ టోర్నమెంట్ శనివారం రాత్రిముగిసింది. ఇందులో ప్రథమ బహుమతి నర్సంపేట జట్టు గెలుచుకోగా వారికి కప్, రూ.30 వేల నగదు బహుమతిని, ద్వితీయస్థానాన్ని కేసముద్రం టీం కైవసం చేసుకోగా వారికి కప్, రూ.20వేల నగదును సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, టీపీసీసీ గుగులోత్ దస్రూనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు అందజేశారు. కార్యక్రమంలో వోలం రమేష్, రావుల మురళి, నూకల వెంకటేశ్వర్లు, అల్లం గణేష్, తరాల సుధాకర్, బోడ విక్కి, తోట అఖిల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు జమాండ్లపల్లి పాఠశాల విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 20 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సమ్మెట వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు చాంప్లానాయక్ తెలిపారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన 8వ తరగతి చదువుతున్న విద్యార్థి లావుడియా సందీప్, విద్యార్థినీ భూక్య నీలవేణిలను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీల్లో కూడా రాణించి పాఠశాలకు, జిల్లాకు పేరుతీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వేముల రమేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తొర్రూరులో కెనరా బ్యాంకు సేవలు షురూ



కెనరా బ్యాంకును ప్రారంభిస్తున్న బ్యాంకు ఉన్నతాధికారులు

తొర్రూరు, జనవరి 20 : తొర్రూరు డివిజన్ కేంద్రంలో కెనరా బ్యాంకు సేవలు శనివారం ప్రారంభమయ్యాయి. బ్యాంకు జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ కవిత హాజరై తొర్రూరు కెనరా బ్యాంకు శాఖను జిల్లా వ్యాపారవేత్త, మహబూబాబాద్ మాజీ మార్కెట్ చైర్మన్ పర్కాల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలో కెనరాబ్యాంకు అనేక ప్రాంతాల్లో విశేష సేవలు అందిస్తుందని, ఈ ప్రాంతప్రజలకు మెరుగైన సేవలు అందించేందు కు తొర్రూరులో బ్రాంచి ప్రారంభించామన్నారు. బ్రాంచి మేనేజర్ సహదేవ్, జిల్లాలోని వివిధ బ్రాంచి మేనేజర్‌లు, సమత కళాశాల కరస్పాండెంట్ కోట రఘునాథరెడ్డి, వ్యాపారులు పాల్గొన్నారు.

పుష్‌పుల్ రైలు పొడిగింపు

డోర్నకల్, జనవరి 20 : కాజీపేట-డోర్నకల్, డోర్నకల్-విజయవాడ, విజయవాడ-డోర్నకల్, డోర్నకల్ -కాజీపేటల మధ్య నడుస్తున్న పుష్‌పుల్ ప్యాసింజర్ రైలు సర్వీసును ఫిబ్రవరి 7వ తేదీ వరకు పొడిగించినట్లు రైల్వేశాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. సామాన్య ప్రయాణికులకు అందుబాటులో ఉండడంతో.. వారినుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న రైల్వేశాఖ అధికారులు రైలు సర్వీసు పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు డీఆర్‌యూసీసీ మాజీ సభ్యులు షైనూపాష, ఖాదర్ తెలిపారు.